
చెత్త వేయొద్దని చప్పల్‌బజార్ ప్రభాత్ అపార్ట్‌మెంట్ వెనుక ఏర్పాటు చేసిన బ్యానర్

రోడ్లపై చెత్త వేస్తే రూ. 1000 జరిమానా

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్త వేస్తే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆటోల్లో చెత్త వేయాలని సూచించారు. అన్ని బస్తీలలో స్వచ్ఛ ఆటోలను అందుబాటులో ఉంచామని తెలిపారు. కాచిగూడను పరిశుభ్రమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని దానికి ప్రజలు సహకరించాలని కోరారు. గురువారం చప్పల్‌బజార్ ప్రభాత్ అపార్ట్‌మెంట్ వెనుక జీహెచ్ఎంసీ సిబ్బందిచే చెత్తను తొలగించి అక్కడ బ్యానర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ చెత్త వేయడం నిషేధించామని, ఎవరైనా చెత్త వేస్తే వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని బ్యానర్‌ను జీహెచ్ఎంసీ ఏఎంఓహెచ్ హేమలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సుభాష్ పటేల్, క్షీరసాగర్, ఎస్. ఎస్. రామ్, తిరుపతినాయక్, దిలీప్, వాసు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాలసీ తీసుకురావాలి

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నూతన క్రీడా పాలసీ తీసుకువచ్చి క్రీడలను అభివృద్ధి చేయాలని తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బి. లక్ష్మయ్య, ఎం. పర్వతాలు గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 15 ఏళ్లుగా రాష్ట్రంలో క్రీడా పాలసీ లేకపోవడం వల్ల క్రీడా రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్కూల్ స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యార్థులు, యువతను క్రీడల్లో ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్నేషనల్ బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీనా, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు.

దశాబ్ద కాలంగా కృష్ణాకాలనీలో డ్రైనేజీ సమస్య

ముషీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని పఠాన్‌బస్తీ, కృష్ణాకాలనీలో దశాబ్ద కాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షుడు డాక్టర్ మినాజ్ ఉద్దీన్ జలమండలి ఉన్నాధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం జలమండలి జీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కొత్త పైపులైన్ వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఫరీద్ ఖాన్, సలీం పాల్గొన్నారు.

దాశరథి, సినారె పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులు ఎక్కడైనా గౌరవించబడతారని ప్రముఖ గాయని హైమవతి భీమన్న అన్నారు. కళానిలయం ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో గురువారం ర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతి ఉత్సవం, జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డా. సి. నారాయణరెడ్డి 90వ జయంతి సభ జరిగింది. దాశరథి పురస్కారాన్ని అధ్యాపకులు, సాహితీవేత్త కె. ప్రభాకర్‌కు, సినారె పురస్కారాన్ని గజల్ గాయని, రచయిత్రి డా. విజయలక్ష్మి పండిట్‌కు బహూకరించారు. హైమావతి మాట్లాడుతూ.. కవులు, కళాకారులు సమాజానికి మార్గనిర్దేశనం చేయగలరన్నారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య, తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్, నిర్వాహకులు సురేందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. దయార మార్కెట్‌లోని ప్రోకేర్ పాలిక్లినిక్ డే కేర్ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ మహ్మద్ వాసీం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు జె. వినోద్‌కుమార్, ఉమ్మల్‌హస్నథ్ తస్నీమ్, విజయ్‌కుమార్, మహ్మద్ అబ్దుల్ రావ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 33 మందికి రూ. 11,61,500 విలువగల చెక్కులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ముఠా గోపాల్ వారికి గురువారం చెక్కులు అందజేశారు. బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు వల్లాల శ్యామ్ యాదవ్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కె. సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి'

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కళాసంస్థల నిర్వాహకులు, కళాకారులు అనారోగ్యం కారణంగా పలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారుల సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ ఆల్ ఆర్టిస్ట్స్ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ వారు గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ గాయని సాయి పావని భర్త సురేష్ మెదడు సమస్యతో కోమాలోకి వెళ్ళిన సందర్భంగా దాతల సహాయం కోసం సమావేశం నిర్వహించారు. గాయని ఆమని ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు. అభిమానులు, కళాకారులు, ప్రముఖులు అందజేసిన వివరాలను ఆమని ప్రకటించారు.

'మున్షీ ప్రేమ్‌చంద్ ధీరత్వ గాథలను యువత చదవాలి'

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుల వివక్షతను అరికట్టేందుకు, సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రముఖ సంఘసేవకులు, కవి, రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ తన కథలు, కవితల ద్వారా ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోగల అంబేడ్కర్ కళాశాల ఆవరణలో రీసెర్చ్ ఫౌండేషన్ ఆఫ్ డివోషనల్ లిటరరీ కల్చర్ స్టడీస్ ఉస్మానియా యూనివర్సిటీ, అంబేడ్కర్ విద్యా సంస్థల సంయుక్తాధ్వర్యంలో మున్షీ ప్రేమ్‌చంద్ చేసిన సామాజిక సేవలపై జాతీయ సదస్సు జరిగింది. సదస్సును ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్, ప్రొఫెసర్ దారేష్విని జ్యోతి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. డాక్టర్ ప్రియదర్శిని మాట్లాడుతూ.. ప్రేమ్‌చంద్ వ్యక్తిత్వాన్ని, ధీరత్వగాథలను నేటితరం యువత చదవాలని సూచించారు. ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్, డాక్టర్ మాధవి మాట్లాడుతూ.. మున్షీ ప్రేమ్‌చంద్ జీవిత చరిత్రను నేటి విద్యార్థుల చదివి సమాజ వికాసం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ నిషికాంత్, ప్రిన్సిపాల్ మట్ట శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి'

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను అమలు చేయడంతోపాటు రైతు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. ఎల్. పద్మ నాయకులు కృష్ణ, రవి, వెంకటేష్‌గౌడ్, మీన, కిరణ్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఫోన్ చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ చోరీ చేసిన వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో గల అభిషేక్ బాయ్స్ హాస్టల్‌లోకి బుధవారం ఓ వ్యక్తి చొరబడి ఫోన్ చోరీ చేశాడు. హాస్టల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు పృథ్విని గురువారం అదుపులోకి తీసుకొని ఫోన్ రికవరీ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, మోదీ, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆర్. జనార్దన్, మద్దూరి శివాజీ, వినయ్‌కుమార్, సత్యేందర్ తదితరులు

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో పలు పార్టీలు, ఎమ్మార్పీఎస్, పలు సంఘాలు సంబరాలు నిర్వహించాయి. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆర్. జనార్దన్ ఆధ్వర్యంలో రాంనగర్ హరినగర్ చౌరస్తాలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

జనార్దన్ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పోరాటం ఫలించిందన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూస రాజు, మద్దూరి శివాజి, గడ్డం నవీన్, కుశాలకుమార్, జి.వెంకటేష్, ఏర్రోళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో..


రాంనగర్ చౌరస్తాలో సంబరాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం మాజీ కన్వీనర్ తాండ్ర మురళి ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో విజయోత్సవం నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. సుప్రీం కోర్టు తీర్పును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నాయకులు గండి కృష్ణ, గజ్జెల సూర్యనారాయణ, మహేష్‌కుమార్, వినయ్, సత్యనారాయణ, గజ్జెల రాజశేఖర్ పాల్గొన్నారు.

మోదీ, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం

చిక్కడపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం దళిత మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గాంధీనగర్ డివిజన్ ఆంధ్రా కేఫ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, ఎస్సీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు సత్యేందర్, దళిత మోర్చా నాయకులు ముత్యాలు, రాజేందర్, నవీన్‌కుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

అంబర్‌పేట: వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి బడుగుల బాలకృష్ణ అన్నారు. 30 ఏళ్ల పోరాటం తర్వాత మాదిగలు ఎదుర్కొంటున్న స్థితిగతులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని అన్నారు. వర్గీకరణ మాదిగల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పోరాటం వల్లనే వర్గీకరణ సాధ్యమైందన్నారు.

మాదిగలకు విద్య, ఉద్యోగ రంగాల్లో న్యాయం

ముషీరాబాద్: వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకమని బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం భోలక్‌పూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు ఉద్యోగ, విద్యా రంగాలలో న్యాయం జరుగుతుందన్నారు.

స్వీట్లు పంచుకుని సంబరాలు

గోల్నాక: వర్గీరణపై సుప్రీం కోర్టు తీర్పుతో దళిత వర్గాల్లో వెలుగులు నింపుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ అంబర్‌పేట నియోజకవర్గం నాయకుడు నల్లగొండ నరేందర్ ఆధ్వర్యంలో గురువారం తిరుమలనగర్‌లో స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నిమ్మల యాదగిరి, వంగూరి ఉపేందర్, భూపతి కుమార్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు మేలు

రాంనగర్: సుప్రీంకోర్టు తీర్పు శుభపరిణామం అని తెలంగాణ గౌడ కల్లు గీత సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ తీర్పు వల్ల విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మాదిగలకు మేలు కలుగుతుందన్నారు.

సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆందోళన



అంబర్‌పేట, బాగ్‌లింగంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి కేటీఆర్ సూచనల మేరకు బీఆర్ఎస్ నేతలు గురువారం ఆర్టీసీక్రాస్ రోడ్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించారు. అంతకు ముందు ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి బజాజ్ ఎలక్ట్రానిక్స్ వరకు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించి సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదించారు. ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నేతలను చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఆందోళన కార్యక్రమంలో ఎం. రాకేష్‌కుమార్, శ్యామ్‌యాదవ్, శివముదిరాజ్, దేవయ్య గడ్డమీది శ్రీనివాస్, బత్తుల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో..

రాంనగర్: అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అంబర్‌పేట శ్రీమరణ చౌరస్తాలో గురువారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు బి. పద్మావెంకటరెడ్డి, విజయకుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి ఓంప్రకాష్, నాయకులు శిరీష ఓంప్రకాష్, మోర శ్రీరాములు ముదిరాజ్, అనిల్‌కుమార్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లిలో

బాగ్‌లింగంపల్లిలో ఆర్టీసీ కల్యాణమండపం వద్ద బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

బస్సుల సంఖ్య పెంచాలి : సీపీఎం

నల్లకుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అరకొరగా బస్సులను నడుపుతుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు పి. మహేందర్ ఆరోపించారు. నగరంలో జనాభాకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. గురువారం నల్లకుంటలో ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలోగల బస్టాప్‌లో బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య, మెట్రో రైల్ బోగీలు పెంచకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం అంబర్‌పేట జోన్ నాయకులు జి. రాములు, బి. సుబ్బారావు, షబానా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఫీవర్ ఆస్పత్రి వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

రాంనగర్‌లో సంతకాల సేకరణ

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జనాభాకు అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్‌లో సిటీ బస్సుల సంఖ్య పెంచాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్ బస్టాప్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ కన్వీనర్ ఎం. దశరథ్, నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యులు, నాయకులు ఆర్. వెంకటేష్, కె. రమేష్, పి. విమల, టి. మహేందర్, ఎండీ సిరాజుద్దీన్, ఎ. శ్రీరాములు పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధన కోసం అమరులైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజల సమిష్టి కృషి వల్లనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ ఉద్యమకారులను అణచివేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. అసోం, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మాదిరిగా ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వాలని, నెలకు రూ. 30 వేల గౌరవ వేతనం, 4 గదుల ఇళ్లు, 100 ఎకరాలలో ఉద్యమకారుల స్మృతివనం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత ఇవ్వాలని, ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఉద్యమకారులు బి. రంగారెడ్డి, కె.టి.ఎస్. ప్రసాద్, బత్తుల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


శాంతియుత నిరసన కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి తదితరులు

మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలను చేపట్టాలి

కవాడిగూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి వారికి న్యాయం చేయాలని మోడల్ స్కూల్ టీచర్స్ జేఏసీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదకొండు సంవత్సరాలుగా బదిలీలు లేవని, చాలామంది ఉపాధ్యాయులు అనారోగ్యంతో చనిపోయారని పేర్కొన్నారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన, ఆవేదన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ.. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. జేఏసీ నేతలు అరవింద్‌గోష్, గోపీనాథ్, కె.సాయిచరణ్, రాజశ్రీ, ఎండీ ఇర్షద్ అలీ, సాజిద్, శివప్రసాద్, రవీందర్, ఏపీ ప్రసాద్, ఆంజనేయులు, రజని, లత మాట్లాడారు. 11 సంవత్సరాలుగా బదిలీలు లేక కుటుంబసభ్యులకు దూరంగా ఒకే పాఠశాలలో పనిచేసే వారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

ఏఐ సామర్థ్యాలతో కొత్త ఆవిష్కరణలు

● ఏఐజీ-ఐఎస్‌బీ ఒప్పందం


ఒప్పంద పత్రాలను సుజాత కుమారస్వామికి అందజేస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని వైద్యుల క్లినికల్ అనుభవాలకు ఏఐ సామర్థ్యాలను జోడించడం ద్వారా ఆరోగ్య సంరక్షణను పునర్వ్యవస్థీకరించే ఒక ప్రణాళిక కోసం ఏఐజీ ఆస్పత్రితో ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) పరస్పర ఒప్పందం చేసుకుంది. గురువారం ఏఐజీ ఆస్పత్రిలో ఒప్పందంపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పేరుతో రూపొందించే ఈ కార్యక్రమం కొత్త ఆవిష్కరణలు, పద్ధతులు, రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐఎస్‌బీలోని పరిశోధన సంస్థ అయిన మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్(ఎంఐహెచ్‌ఎం) ఈ కార్యక్రమంలో ప్రధాన భాగస్వామిగా ఉంటుంది. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్, డిజిటల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజాత కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. గురువారం బుద్వేల్ రైల్వే స్టేషన్ సమీపంలో 45 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలి'

నల్లకుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి బదులు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటోడ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. నగరంలో హత్యలు జరగడానికి ప్రధాన కారణం మద్యం అని అన్నారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం మహిళలు డిమాండ్ చేసిన దాఖలాలు లేవని, వారి డిమాండ్ సంపూర్ణ మద్యపాన నిషేధం తప్ప మరేమీ లేదన్నారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో గిరాకీ దెబ్బతినడంతో సుమారు 50 మంది డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సంపూర్ణ మద్యపాన నిషేధంపై ప్రభుత్వం స్పందించకపోతే మహాత్మాగాంధీ జయంతి రోజున ఆమరణ దీక్ష చేపడతామని హెచ్చరించారు.

సమావేశంలో జేఏసీ నాయకులు అహ్మద్ అక్తర్, ఫారుక్‌బాయి, లతీఫ్‌బాయి, మహమ్మద్ ఆజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


గద్దర్ వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ, క్రాంతికిరణ్, వెంకట్‌రెడ్డి, గుమ్మడి సూర్యకిరణ్ తదితరులు

6న గద్దరన్న యాదిలో..

● రవీంద్రభారతిలో ప్రథమ వర్ధంతి సభ

పంజాగుట్ట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాయుద్ధనౌక గద్దర్ వ్యక్తి కాదు శక్తి అని, ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తామని పలువురు వక్తలు అన్నారు. గద్దర్‌ను మర్చిపోవడం సాధ్యం కాదని, ఆయన పాట జనంలో సజీవంగా ఉంటుందన్నారు. గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ గుమ్మడి సూర్యకిరణ్ అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రథమ వర్ధంతి సభ పోస్టర్‌ను రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకటరెడ్డి, వేములపాటి అజయ్, సీఎల్ యాదగిరి, ఏపూరి సోమన్న, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ తదితరులు ఆవిష్కరించారు. ఈ నెల 6న గద్దరన్న యాదిలో రవీంద్రభారతిలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా గద్దర్ రాసిన రెండు పుస్తకాలను ఆవిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఓయూ ప్రొఫెసర్ పరశురాం, యశ్పాల్, రచయిత జలజ పాల్గొన్నారు.

డ్రగ్స్, మనీలాండరింగ్ కేసుల పేరుతో..

మహిళను బెదిరించి రూ. 40 లక్షలు కాజేత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హత్య, డ్రగ్స్ సరఫరా, మనీలాండరింగ్ కేసుల పేరుతో సైబర్ నేరగాళ్లు మహిళను బెదిరించి రూ. 40 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన మహిళ(40)కు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఫెడెక్స్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నామని పరిచయం చేసుకున్న అతడు మీ పేరున ఉన్న పార్సిల్‌లో ఎండీఎంఏ డ్రగ్ ఉందని, కేసు నమోదైందని చెప్పాడు. దీనిపై ముంబై పోలీసులతో మాట్లాడమని ఫోన్ కలిపాడు. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి తాను ముంబై క్రైం బ్రాంచ్ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. మీపై హత్య కేసు, డ్రగ్స్ సరఫరా, మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయని చెప్పాడు. దానికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లు కూడా చూపించాడు. ఈ కేసులో మీతోపాటు కుటుంబ సభ్యులను కూడా అరెస్ట్ చేస్తామని, వారి బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తామని భయపెట్టాడు. మహారాష్ట్ర మాజీ సీఎం ఫొటోను చూపించి, ఆయనతో నాకు పరిచయం ఉందని నమ్మించాడు. కుటుంబం మొత్తం జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించాడు. కేసు నుంచి బయటపడాలంటే రూ. 40 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. మహిళను బెదించి తన ఖాతాలోకి డబ్బు బదిలీ చేయించుకున్నాడు. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

టెకీపై అత్యాచారం కేసులో రెండో నిందితుడికి రిమాండ్

వనస్థలిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో రెండో నిందితుడు మునగాల శివాజీరెడ్డి అలియాస్ చింటూరెడ్డిని బుధవారం అర్ధరాత్రి గుంటూరు జిల్లా చిలుకలూరిపేటలో పోలీసులు అరెస్ట్ చేసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. జాబ్ వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని చిన్ననాటి స్నేహితుడైన ఎడ్ల గౌతమ్‌రెడ్డి ట్రీట్ ఇవ్వమని కోరాడు. ట్రీట్ ఇస్తున్న సమయంలో సదరు ఉద్యోగినికి బలవంతంగా మద్యం తాగించి అపస్మారక స్థితిలోకి వెళ్లగానే గౌతమ్‌రెడ్డి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అతడి స్నేహితుడు శివాజీరెడ్డిని పిలిపించి యువతిపై అత్యాచారం చేయించాడు. యువతి స్పృహలోకి వచ్చిన తర్వాత హోటల్ గదిలో ఉన్న గౌతమ్‌రెడ్డి, శివాజీరెడ్డిని చూసి కేకలు వేయడంతో హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎడ్ల గౌతమ్ రెడ్డిని మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మరో నిందితుడు శివాజీ రెడ్డిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కాశిరెడ్డి తెలిపారు.

ఆపరేషన్ ముస్కాన్..

524 మంది చిన్నారులను కాపాడిన అధికారులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భిక్షాటన చేస్తున్న పిల్లలు, బాల కార్మికులను కాపాడేందుకు పోలీసులు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ 10వ ఎడిషన్‌లో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 524 మంది చిన్నారులను కాపాడారు. కార్మిక శాఖ, రెవెన్యూ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్‌లైన్, పోలీసులు, ఎన్‌జీఓలు సంయుక్తంగా జూలై 1 నుంచి జూలై 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 25 బృందాలు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 524 మంది పిల్లలను కాపాడాయి. వీరిలో 481 మంది బాలురు, 43మంది బాలికలు ఉన్నారు. రాష్ట్రానికి చెందిన వారు 317 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 207 మంది ఉన్నారని తెలిపారు. పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై 20 కేసులు నమోదు చేశామన్నారు.

పెట్టుబడి పేరుతో మోసం కేసులో మరో ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.6.05కోట్ల మోసానికి పాల్పడిన ఓ ముఠాలోని ఇద్దరు సైబర్ నేరగాళ్లను ఇదివరకే అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న మరో ఇద్దరిని రాచకొండ సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాధవరం వంశీ కృష్ణారావు(35), తాటిపల్లి రాకేష్(28), ధవళేశ్వరపు నవీన్‌కుమార్(37), జెట్టి ఫణికుమార్(34) ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. ఆసక్తి చూపిన వారిని ఆర్7322 టీమ్ హార్వే పేరుతో టెలిగ్రాం గ్రూపులో యాడ్ చేశారు. పెట్టుబడి పెట్టిన వారికి ముందుగా కొంత మొత్తం లాభం వచ్చినట్లు చూపించేవారు. డబ్బు తమ ఖాతాల్లో వేయించుకొని, యాప్‌లో డబ్బు పెట్టుబడి పెట్టినట్లు చూపించేవారు. ఇలా పలువురిని మోసం చేసి రూ.6.05 కోట్లు వసూలు చేశారు. లాభాలు వచ్చినట్లు యాప్‌లో చూపించినా, డబ్బు విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడం.మోసగాళ్లు స్పందించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న ధవళేశ్వరపు నవీన్ కుమార్, జెట్టి ఫణికుమార్‌ను గురువారం అరెస్ట్ చేశామని సైబర్ క్రైం డీసీపీ అరవింద్ బాబు తెలిపారు.

మేస్త్రీ అదృశ్యం

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మేస్త్రీ అదృశ్యమయ్యాడు. చప్పల్‌బజార్‌లో నివసిస్తున్న బి. స్వామి(51) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కుమారుడితో గొడవపడి గత ఏడాది అక్టోబర్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య శ్యామల కాచిగూడ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.